ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 12 జూన్ 2025



వ్యవసాయం పండుగలా..

గత ఏడాది నూతన ప్రభుత్వం కొలువుదీరాక ఆధునిక వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలతోపాటు జిల్లాలో 1017 మందికి వ్యవసాయ పరికరాలు అందించారు. రాయితీ విత్తనం, మందులు, రైతులకు సలహాలు ఇస్తూ వ్యవసాయాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారు. 30 వేల ఎకరాలకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేశారు. సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధులు కేటాయించి, చివరి ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. పండ్ల తోటల అభివృద్ధి కోసం నీటి కుంటలు తవ్వించడం, కోల్డ్‌స్టోరేజ్‌లు, ప్యాక్ హౌస్‌ల నిర్మాణానికి రాయితీ అందించారు. ఉద్యాన పంటల ఎగుమతికి జిల్లాను కేంద్రంగా మార్చేలా అడుగులు వేస్తున్నారు.

పెట్టుబడుల రహదారులు

జిల్లాలో బెంగళూరు- హైదరాబాద్ రెండు మెట్రో నగరాలను కలుపుతూ పెనుకొండ, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా విస్తరించిన నాలుగు లేన్ల 44 జాతీయ రహదారిని 12 వరుసలతో విస్తరణకు ప్రాథమికంగా కేంద్రం గత ఏడాదే ఆమోదం తెలిపింది. దక్షిణాదిలోనే అత్యధిక వరుసల జాతీయ రహదారి జిల్లాలో ఏర్పడబోతోంది. జిల్లాలో 75 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే బెంగుళూరు- మైదుకూరు కడప జిల్లా, మేదరమెట్ల అమరావతి- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నాలుగు- ఆరు వరుసలతో నిర్మాణం సాగుతోంది. గోరంట్ల- హిందూపురం రోడ్డు 43.58 కి.మీలను నాలుగు వరుసలుగా రూ.809 కోట్లతో విస్తరణకు శ్రీకారం చుట్టారు. ముదిగుబ్బ, పుట్టపర్తి మీదుగా కోడూరు దాకా జాతీయ రహదారి 342 నిర్మాణం తుది దశకు వచ్చింది. జిల్లాలో జాతీయ రహదారి 716జీ కడప జిల్లా ముద్దనూరు నుంచి హిందూపురం దాకా రెండు వరుసలతో ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించి పనులు చేపడుతున్నారు. కోడూరు- మేదరమెట్ల వరకు తలపెట్టిన ఎక్స్‌ప్రెస్‌వేని అమరావతిదాకా అనుసంధానం చేయనున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పునరుజ్జీవం


హంద్రీనీవా లైనింగ్ పనులు చకచకా

జిల్లాలోని చెరువులను కృష్ణా జలాలతో నింపే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు నూతన ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం రూ.930.7 కోట్లు ఖర్చు చేయనున్నారు. వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో 230 కిలోమీటర్ల లైనింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మడకశిర నియోజకవర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణాల డీపీఆర్‌కు నిధులు మంజూరు చేశారు. హంద్రీనీవా బైపాస్ కెనాల్‌కు రూ.530 కోట్ల అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుట్టపర్తి నియోజక వర్గానికి సాగునీరిచ్చే 193 చెరువుల ఎత్తిపోతల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మడకశిర ఉపకాలువ వెడల్పు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఏడాదిలో మోక్షం

వైసీపీ పాలనలో ఛిద్రమైన గ్రామీణ రహదారులు కూటమి ప్రభుత్వంలో నూతన శోభను సంతరించుకుంటున్నాయి. పల్లె పండుగ కింద 32 మండలాల్లో 218 కిలోమీటర్ల మేర నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.15 కోట్లతో జిల్లాలోని గుంతల రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారు. రోడ్లు భవనాల శాఖ కింద జిల్లాలో 436 పనులు మంజూరు చేసి 427 పూర్తి చేశారు.



ఏడాది పాలన
భేష్..!

- ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు
- వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై శ్రద్ధ
- మెరుగైన సౌకర్యాలతో పెట్టుబడుల ఆకర్షణ
- సంక్షేమం, అభివృద్ధిలో జిల్లా ముందడుగు

విధ్వంసం నుంచి వికాసం వైపు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసమైన అన్ని రంగాలు నూతన ప్రభుత్వ పాలనలో పునరుజ్జీవం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాదిలోపే అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రగతిని పరుగులు పెట్టిస్తోంది. జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలు నేరవేస్తూ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా అన్ని వర్గాల సంతృప్తే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

-ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక అభివృద్ధి 4.0 పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో జిల్లాకు పెట్టుబడులు పెరిగాయి. ఇప్పటికే మడకశిర నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమతోపాటు కల్లుమర్రి గ్రామాల పరిధిలో 15 వేల ఎకరాల్లో రూ. 7500 కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకు వచ్చాయి. గుడిపల్లిలో 70.7 ఎకరాల్లో రూ. 1046 కోట్లతో పెట్టుబడితో ఆటోమొబైల్ భారీ పరిశ్రమ, బస్సుల బాడీ

పెరుగుతున్న పెట్టుబడులు

బిల్డింగ్ తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది. వీటి ద్వారా 2381 మందికి ఉపాధి లభించనుంది. చిలమత్తూరు టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రీయల్ క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు 35వేల ఎకరాల భూసేకరణకు వేగం పెంచారు. జిల్లాలో రూ. 11920 కోట్ల పెట్టుబడులతో రెండు ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు ఏర్పాటుకు ముందుకు రాగా 4130 మందికి ఉపాధి అవకాశం కల్పించే ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ సంస్థ 2000 మెగావాట్ సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈప్రాజెక్టుకు రూ. 9000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. దీంతో 3900 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇలా కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే పారిశ్రామిక రంగం జిల్లాలో పరుగులు పెట్టనుంది.

సంక్షేమానికి పెద్దపీట

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ ముందుకు సాగుతోంది. జిల్లాలో ఏడాదిలో సామాజిక పింఛన్ల కింద 267500 మందికి రూ.1374.72 కోట్లు అంద జేశారు. ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇప్పటి వరకూ రెండు విడతల్లో 1101114 మందికి అందజేశారు. ఇందుకోసం రూ.928293102 ఖర్చు చేశారు. అన్నక్యాంటీన్ ద్వారా ఎందరో పేదలకు ఆకలి తీర్చుస్తున్నారు. చేనేత కార్మికుల గృహాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జిల్లాలో 33274 మంది చేనేత కార్మికులు, పదివేలదాకా పవర్‌లూమ్స్ యూనిట్లకు లబ్ధిచేకూరుతోంది. మిగిలిన పథకాల అమలుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఎయిర్ కనెక్టివిటీకి అడుగులు

పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోచిస్తున్నాయి. ఇది కార్యరూపం దాల్చితే జిల్లా పౌరవిమాన సర్వీసులతో ప్రపంచ దేశాలకు ఎయిర్ కనెక్టివిటీ పెరుగుతుంది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి

ఏరువాక, విత్తన వేరుశనగ పంపిణీలో మంత్రి సత్యకుమార్ యాదవ్


తుమ్మలలో ఏరువాక కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తుమ్మల గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పుడమితల్లికి పూజలు చేసి ఎద్దులతో పొలాన్ని దుక్కిదున్ని ఖరీఫ్‌కు శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనసంప్రదాయానికి ఏరువాక పౌర్ణమి ప్రతీక అని, రైతులు వాటిని కొనసాగిస్తూ ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మెరుగైన దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం గొట్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విత్తనవేరుశనగ పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు ముందుగా నాణ్యమైన విత్తనాల పంపిణీ చేసి రైతులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వేరుశనగతో పాటు ఉలవలు, మినుములు, అలసందలు, కొర్ర, కందులు త్వరలోనే పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏపీసీడ్స్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అరుణశ్రీ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఏపీపీ సనావుల్లా, ఏటలు ముస్తఫా, రమాదేవి, ఓబిరెడ్డి, ఎంపీడీఓ సాయిమనోహర్ పాల్గొన్నారు.

షాకింగ్ బదిలీలు..!

పట్టుపరిశ్రమ శాఖలో చోద్యం

దరఖాస్తులు, రిక్వెస్టులు లేకుండానే స్థానచలనం

ఉన్నఫలంగా ఉత్తర్వులు జారీ... విస్మయం వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

5

గుక్కెడు నీటి కోసం అవస్థలు

ఆర్.యర్రగుంటపల్లిలో దాహం కేకలు

తాగునీటి సమస్యతో అల్లాడుతున్న ప్రజలు

పట్టించుకోని అధికారులు


తాగునీటి సమస్య వివరిస్తున్న ఆర్.యర్రగుంటపల్లి గ్రామస్థులు

ధర్మవరం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గుక్కెడు నీటి కోసం ఆ గ్రామస్థులు తల్లడిల్లుతున్నారు. అధికారులు, పాలకులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధర్మవరం మండలం ఆర్.యర్రగుంటపల్లిలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలో రెండు పంచాయతీ బోర్లు ఉన్నాయి. వీటితో పాటు గ్రామానికి సత్యసాయి నీరు కూడా సరఫరా అవుతుంది. పంచాయతీ బోర్లలో ఒకదాంట్లో నీరు రాలేదు. ఎస్సీ కాలనీలో వచ్చే పంచాయతీ బోరు నీరు ఒక్కటే దిక్కు. ఆ బోరులో నీరు సమృద్ధిగా లేకపోవడంతో కొన్ని ఇళ్లవద్దకు మాత్రమే సరఫరా అవుతున్నాయి. దీంతో బీసీ కాలనీలో చుక్కనీరు సరఫరా కాక స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. మూడు రోజులకొకసారి వచ్చే సత్యసాయి నీరు.. తిప్పేపల్లి సమీపంలో పైపులైను మరమ్మతులకు గురికావడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల బోరుబావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తాగునీటి సమస్యపై అధికారులు, పాలకులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోలేదు



రెండు బిందెల నీళ్ల కోసం అవస్థలు పడుతున్నాం. కొన్ని నెలలుగా నీళ్లురాక ఊరంతా ఇబ్బంది పడుతున్నారు. సమస్యపై ఏ ఒక్కరూ కనికరించలేదు. మాలాంటి వృద్ధులు తాగునీరు తెచ్చుకోవాలంటే చాలా కష్టం. మా అవస్థలు చెప్పలేనివి. ఇంటి దగ్గర ఉంటే తెచ్చుకోవడమే కష్టం. పొలాల వద్దకు వెళ్లి ఎలా తెచ్చుకోగలం. అధికారులు కరుణించి మా గ్రామానికి తాగునీరు వచ్చేలా చేయాలి.

-నారాయణ, ఆర్.యర్రగుంటపల్లి

దూర ప్రాంతానికి వెళుతున్నాం



మా గ్రామంలో నీళ్లు లేక అవస్థలు పడుతున్నాం. సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. సత్యసాయి నీరు వచ్చేది. నీరు సరఫరా అయ్యే పైపులైను మరమ్మతులకు గురికావడంతో మాకు రాలేదు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారులేరు. పనులు వదిలేసుకుని పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.

- కేశమ్మ, ఆర్.యర్రగుంటపల్లి

నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం

ఆర్.యర్రగుంటపల్లికి సత్యసాయి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేస్తాం. పంచాయతీ, సత్యసాయి నీటి సరఫరా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. -వెంకటేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, ధర్మవరం

పల్లె నుంచి పారిశ్రామికవేత్తలు రావాలి

- బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత 5

బడి గంటలు మోగే వేళ

నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

పుట్టపర్తి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి. ఉరుకులు, పరుగుల జీవితం మళ్లీ ప్రారంభం కానుంది. సుదీర్ఘ కాలం ఇంటి వద్ద ఆటపాటలతో గడిపిన చిన్నారులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. ఇన్నాళ్లు పిల్లలు లేక బోసిపోయిన తరగతి గదులు సందడిగా మారనున్నాయి. ఇప్పటికే పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు పిల్లలకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాయి. అయితే ప్రైవేట్ స్కూల్‌లో చదివే పిల్లలకు ఫీజులు, యూనిఫాంలు, పుస్తకాలు, బూట్లు, కొనుగోలుకు తల్లిదండ్రులకు ఖర్చులు తడిసిమోపెడవనున్నాయి. ఇప్పటికే విద్యాసామగ్రికి సంబంధించిన దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజే పిల్లలకు విద్యా కిట్లు అందజేయనుంది. నగరం, పట్టణ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం స్కూల్ బస్సులు, ఆటోలతో ప్రధాన వీధులు కిక్కిరిసిపోనున్నాయి.

గిరిజన సదస్సులను సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

పుట్టపర్తిరూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15నుంచి 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జన జాతీ య గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంపై ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. సోమందేపల్లి మండలం నాగేనాయినిచెరువుతండా, తనకల్లు మండలం ముండ్లవారిపల్లి, గాండ్లపెంట మండలం తుమ్మలబైలుతండాలలో గిరిజన సంబంధిత శాఖల సమన్వయంతో ఎంపీడీఓల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. సంబంధిత మండలాల్లోని గిరిజనులు సదస్సులో పాల్గొని ఆధార్, బ్యాంకు అకౌంట్, హెల్త్‌కార్డు, గ్యాస్‌కనెక్షన్లు, జాబ్‌కార్డు, విద్యుత్ తదితర సమస్యలు పరిష్కరించుకోవలన్నారు.

మాస్టర్ ప్లాన్

మాస్టర్‌ప్లాన్ రోడ్డును వదలని కబ్జాదారులు

40 అడుగుల రోడ్డు కుదింపు

సొంత స్థలంలోకి మిగులు స్థలం కలిపివేత

రూ.కోటి విలువైన రస్తా ఆక్రమణ

ధర్మవరం తిక్కస్వామి నగర్‌లో ఘటన


తిక్కస్వామి నగర్‌లో 40 అడుగుల రోడ్డును చదును చేసిన దృశ్యం

ధర్మవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రోడ్డును సైతం కొందరు ఆక్రమించేశారు. ఈక్రమంలోనే 40 అడుగుల రోడ్డును చదును చేసి, సర్వేరాళ్లు పాతి, విక్రయానికి పెట్టారు. దీంతో రోడ్డు లేక తిక్కస్వామి నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

ఆక్రమణ ఇలా...

తిక్కస్వామినగర్‌లో సర్వేనెంబరు 375-1ఏ మాస్టర్ ప్లాన్‌లో రస్తా ఉంది. దీనికి లింక్ రోడ్డు తిక్కస్వామినగర్ నుంచి చక్రవర్తి థియేటర్‌వరకు వెళ్తుంది. వీటి ద్వారా ఆ ప్రాంత ప్రజలు సులభంగా రాకపోకలు సాగించ డానికి వీలుండేది. ఇటీవల ఎన్డీఏ కూటమిలోని జాతీయ పార్టీకి చెందిన నాయకుడు మాస్టర్ ప్లాన్ రోడ్డుకు ఆనుకుని 60 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అయితే మాస్టర్ ప్లాన్ రోడ్డుకు సంబంధించిన స్థలాన్ని దాదాపు 10 అడుగుల వెడల్పుతో తను కొనుగోలు చేసిన స్థలంలోకి కలుపుకోవాలని పన్నాగం పన్నాడు. అనుకున్నదే తడవుగా కొనుగోలు చేసిన స్థలంతో పాటు 40 అడుగుల రోడ్డును సైతం చదును చేయించాడు. రోడ్డును 25, 30 అడుగులకే కుదించి, మిగులిన దాదాపు 20 సెంట్ల స్థలాన్ని తాను కొన్న భూమిలోకి కలుపుకున్నాడు. ప్లాట్లు వేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించినా కబ్జాదారులు తమ పలుకుబడిన ఉపయోగించి, అడ్డుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ సెంటు దాదాపు రూ.5 లక్షలు పలుకుతోంది. ఈ లెక్కన రూ.కోటి విలువైన భూమిని అప్పనంగా కొట్టేస్తున్నారు.

ప్రశ్నిస్తే దౌర్జన్యమే..

ప్రభుత్వ భూములంటే కొందరు తమ సొంత ఆస్తిలా భావిస్తుంటారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉంటాయే తెలుసుకుని వాటిని కబ్జా చేయడమే పనిగా పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలే కాదు రోడ్లను వదలని పరిస్థితి. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే వారిపై భౌతిక దాడులకు దిగుతూ భయాందోళన కలిగిస్తున్నారు. దీంతో మనకెందుకు వచ్చిన గొడవలే అని సామాన్యులు మిన్నకుండే పరిస్థితి నెలకొంది. పాలకులు అక్రమాలను గుర్తించి అక్రమార్కులు, దౌర్జన్యపరులపై చట్టపరంగా చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

పరిశీలిస్తాం

పట్టణంలోని తిక్కస్వామినగర్‌లో మాస్టర్ ప్లాన్ రోడ్డు ఉన్నది వాస్తవమే. ఇది వరకే ఎవరో రాళ్లను పాతితే వాటిని తొలగించి వచ్చాం. మరలా పాతి ఉంటే వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-అలివేళమ్మ, టీపీఎస్, ధర్మవరం


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఆగుతూ.. సాగుతూ..!

ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌లో గందరగోళం

ప్రిఫరెన్షియల్‌లో జనరల్ వేకెన్సీలు

ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

తొలిరోజు అర్ధరాత్రి ప్రక్రియ నిలిపివేత

11న సాయంత్రం తాజాగా ప్రారంభం

5

అయ్యో పాపం

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల వాహనం

ఏడాది చిన్నారి మృతి



తన్మయి మృతదేహం

ధర్మవరంరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బారావు పేట వద్ద ద్విచక్రవాహనాన్ని గ్యాస్ సిలిండర్ల వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఏడాది వయసున్న చిన్నారి తన్మయి బుధవారం మృతిచెందింది. బాధితులు, రూరల్ పోలీసులు తెలిపిన మేరకు బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామానికి చెందిన నరసింహులు, మణికంఠేశ్వరి దంపతులు తమ మూడో కుమార్తె చిన్నారి తన్మయి(1)కలిసి ద్విచక్రవాహనంపై ధర్మవరం నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో సుబ్బరావుపేట వద్దకు వెళ్లగానే అప్రాచెరువు నుంచి ధర్మవరం వైపు వస్తున్న గ్యాస్ సిలిండర్ల వాహనం ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడింది. అందులో ప్రయాణిస్తున్న నరసింహులు, మణికంఠేశ్వరి, చిన్నారి తన్మయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చిన్నారిని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దంపతులిద్దరూ చికిత్సలు పొందుతున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చిన్నారి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పూడ్చిన బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం

తనకల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలవారి పల్లిలో పూడ్చిన బాలుడి మృతదేహానికి వారం రోజుల తర్వాత బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ గోపి తెలిపిన మేరకు ముత్యాలవారిపల్లిలో నివాసముంటున్న పుష్పాల సంధ్యారాణి, నిరీష్‌కుమార్ దంపతుల కుమరుడు నిషాంత్ (3)ను ఈనెల 3న గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా తీసుకెళ్లింది. మధ్యాహ్నం 12గంటల సమయంలో నిషాంత్ పాఠశాల ఆవరణ పక్కనే ఉన్న నీటి తొట్టెలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఇంటికి తీసుకెళ్లి, మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడి మృతిపై తల్లిదండ్రులు అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలను వేరువేరుగా విచారించారు. వారిరువురి సమాధానాలు పొంతనలేకుండా ఉండటంతో పోలీసులును ఆశ్రయించారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందినట్లు తల్లి సంధ్యారాణి 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేశారు. అనంతరం డాక్టర్లను గ్రామానికి పిలిపించి బాలుడి శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, బంధువులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో మునిగి యువకుడి మృతి



భరత్‌కుమార్ (ఫైల్)

కూడేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన కొత్తూరు భరత్ కుమార్(23) పీఏబీఆర్ నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు, అనంతపురం నగరానికి చెందిన కొత్తూరు భరత్‌కుమార్, మణి, అనిల్, భరత్ కుమార్ స్నేహితులు. వీరు నలుగురు రెండు బైక్‌లపై బుధవారం పీఏబీఆర్‌కు వెళ్లారు. నీటిలో దిగి సంతోషంగా గడుపుతున్న సమయంలో కొత్తూరు భరత్ కుమార్ ఈత రాక మునిగిపోయాడు. స్నేహితులు నీటి నుంచి బయటకు తీసి వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. అంబులెన్స్ ఆలస్యం కావడంతో బైక్‌పై జల్లిపల్లి వద్దకు వచ్చారు. అక్కడికి 108 సిబ్బంది చేరుకుని పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కొత్తూరు భరత్ కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం బెంగళూరులో ఉంటున్నాడు. ఇటీవలే అనంతపురానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి పీఏబీఆర్‌కు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు ప్రసాద్, విశాల, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళా రైతు మృతి



ఉమాదేవి(ఫైల్)

గార్లదిన్నె, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంక గ్రామానికి చెందిన మహిళా రైతు రాగే ఉమాదేవి (39) బుధవారం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. కోటంక గ్రామానికి చెందిన రాగే సుబ్రహ్మణ్యం, ఉమాదేవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికి ఉన్న ఏడు ఎకరాలలో నాలుగు ఎకరాలు వేరుశనగ, మూడు ఎకరాలలో చీనీ తోటను సాగుచేస్తున్నారు. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో పంటలను బతికించుకునేందుకు సుమారు ఐదు బోర్లు వేశారు. దీంతో పాటు గత మూడు సంవత్సరాల నుంచి సాగుచేసిన పంటల దిగుబడి రాకపోవడంతో అప్పులు అధికమయ్యాయి. అప్పులు ఎలా తీర్చేదని తరుచూ దంపతులు గొడవ పడుతుండేవారు. అప్పులు తీర్చే మార్గంలేక ఉమాదేవి గత నెల 21 చీనీ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఫలితం లేకపోవడంతో తిరిగి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల హోదా మార్పు

అనంతపురంటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యుకేటర్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల క్యాడర్‌ను ఇక నుంచి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తమకు హోదా కల్పించడంపై వారు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, వేణుగోపాల్, మహ్మద్‌రఫీ, లక్ష్మీనారాయణ, విజయబాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం పడింది. అనంతపురం, బొమ్మనహాళ్ మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. యాడికి, పుట్లూరు, నార్పల, డి.హీరేహాళ్ తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. మంగళవారం రాత్రి కళ్యాణదుర్గంలో 12.4, యల్లనూరు 8.6 మీ.మీ వర్షపాతం నమోదైంది.

రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాకు ఓ మోస్తరు నుంచి భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఏపీ తీర ప్రాంతంలోని పశ్చిమ మధ్య బంగాళఖాతంలో ఎగువ వాయు తుఫాన్ ఏర్పడిందన్నారు. సముద్రమట్టానికి 5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఈ నెల 15 వరకు ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. పలు చోట్ల ఈదురుగాలులు 40 నుంచి 50 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందన్నారు. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ విపత్తుల శాఖ హెచ్చరించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రవేశాల జాబితా విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థుల జాబితా విడుదల చేశామని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జయలక్ష్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థుల మార్కులు, ఖాళీసీట్ల సంఖ్య మేరకు ఎంపిక జాబితా విడుదల చేశామన్నారు. ఎంపికైన వారికి దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు సమాచారం వస్తుందని పేర్కొన్నారు. ప్రవేశాలకు అవసరమైన పత్రాలను సమర్పించి వారంలోగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

పల్లె నుంచి పారిశ్రామికవేత్తలు రావాలి

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి పారిశ్రామిక వేత్తలు రావాలనీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం యువతకు ఉద్యోగ కల్పనపై సీడాప్, సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారన్నారు. చిన్నతరహా పరిశ్రమలపై యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. వారు ఉత్పత్తి చేసే వాటికి ప్రభుత్వమే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై యువతలో ఉన్న అపోహలను ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, సీడప్ స్టేట్ మిషన్ మేనేజర్ విజయకుమార్, సెంచూరియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ జోనల్ ఆఫీసర్ మారుతి, జేడీఎం సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..!

- ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌లో గందరగోళం
- ప్రిఫరెన్షియల్‌లో జనరల్ వేకెన్సీలు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం
- తొలిరోజు అర్ధరాత్రి ప్రక్రియ నిలిపివేత
- 11న సాయంత్రం తాజాగా ప్రారంభం



ఎస్జీటీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం కొనసాగుతోంది. ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లుగా ప్రక్రియ సాగుతోంది. మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ఇలా మొదలు పెట్టి.. అలా వాయిదా వేస్తూ కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ రాష్ట్ర, జిల్లా అధికారుల అనాలోచిత నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. నగర శివారులోని ఆర్డీటీ ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీ రాత్రి 10.30 గంటలకు కౌన్సెలింగ్ మొదలైంది. ప్రిఫరెన్షియల్ వేకెన్సీల్లో జనరల్ వేకెన్సీలు ప్రత్యక్షం కావడంతో సంఘాల నాయకులు అధికారులను నిలదీశారు. దీంతో నాలుక కొరుక్కున అధికారులు అర్ధరాత్రి 12.35 గంటల సమయంలో వాయిదా వేశారు. మరుసటి రోజు బుధవారం ఫ్రెష్‌గా కౌన్సెలింగ్ ప్రారంభించారు. అదికూడా.. ఉదయం 10 గంటలకు అని ప్రకటించి.. సాయత్రం 4 గంటలకు మార్చారు. చివరకు 5 గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించారు. కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆర్‌జేడీ శామ్యూల్ సందర్శించారు. సీరియల్ నంబర్ 1 నుంచి 144 వరకూ ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లకు, ఆ తర్వాత సీరియల్ నంబర్ సుమారు 350 వరకూ జనరల్, స్పౌజ్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. రాత్రి 10.20 గంటలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్ల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. రాత్రి భోజన విరామం తర్వాత మిగిలిన టీచర్ల కౌన్సెలింగ్ ప్రారంభించారు.

వర్షాల వేళ ఏర్పాట్లు శూన్యం

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అనంతపురం జిల్లా కలెక్టర్ కూడా ముందుగానే ప్రకటించారు. మాన్యువల్ కౌన్సెలింగ్‌కు వందలాది మంది టీచర్లు వచ్చారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు వెంట వచ్చారు. దీంతో కౌన్సెలింగ్ ప్రాంగణం కిటకిటలాడింది. ఓ వైపు వర్షం కురుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. తగినన్ని కుర్చీలు, మంచి నీరు కూడా కూడా అందుబాటులో ఉంచలేదు. అధికారుల తీరుపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రిఫరెన్షియల్ దుర్వినియోగం



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న టీచర్లు

అనంతపురం విద్య, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రిఫరెన్షియల్ కేటగిరీని కొందరు టీచర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు దుర్వినియోగం చేశారని అనంతపురం జిల్లా డీఈఓ ప్రసాద్‌బాబుకు బాధిత టీచర్లు రామతులశమ్మ, వెంకట శ్రీనివాసులు, రమేష్ తదితరులు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతపురం కేఎస్ఆర్ బాలికల హైస్కూల్‌లో ఆరు స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లిష్ పోస్టులు ఉన్నాయని, వీటిలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద 3 మాత్రమే భర్తీ కావాల్సి ఉందని అన్నారు. డీఈఓ కార్యాలయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది నిర్వాకం వల్ల జీవోకు విరుద్ధంగా ఐదు పోస్టులను ప్రిఫరెన్షియల్ కింద భర్తీ చేశారని అన్నారు. దీని వల్ల సీనియారిటీ జాబితాలో మిగిలిన టీచర్లకు చాలా నష్టం జరుగుతుందని వాపోయారు. శ్రీనివాసులు అనే టీచర్ గత బదిలీల్లో పీహెచ్ (బ్లైండ్) కేటగిరీలో బదిలీలపై ధర్మవరం గవర్నమెంట్ స్కూల్‌కు వచ్చి పని చేస్తున్నారని, ప్రస్తుత బదిలీల్లో ఆయన తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉందని అన్నారు. ఆయన పీహెచ్ (బ్లైండ్) కేటగిరీ వదిలేసి జనరల్ కేటగిరీకి దరఖాస్తు చేసుకుంటున్నట్లు హెచ్ఎంకు లెటర్ ఇచ్చారని, కాబట్టి ఆయన పీహెచ్ కేటగిరీ పోస్టు ఖాళీ చూపాల్సి ఉందని అన్నారు. డీఈఓ కార్యాలయంలో పీహెచ్, జనరల్ వేకెన్సీలో దేన్నీ చూపలేదని అన్నారు. దీని వల్ల ఒక పోస్టు లాస్ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ప్రిఫరెన్షియల్ కేటగిరీకింద దరఖాస్తు చేసి.. కేఎస్ఆర్ హైస్కూల్‌కు వచ్చారని అన్నారు. ఈ విషయంలో అనేక అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న జడ్పీ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్స్ సురేష్‌బాబు, రంగస్వామి, అమరేంద్ర కుమార్‌రెడ్డి, మాదార్‌బీ నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లకు బదిలీపై వచ్చారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

32 మంది హెచ్ఎన్ఎస్ఎస్ ఉద్యోగుల బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం (హెచ్ఎన్ఎస్ఎస్) లో పని చేస్తున్న 32 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు సూపరింటెండెంట్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, 12మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, ఐదుగురు అటెండరకు స్థానచలనం కల్పించారు. టెక్నికల్ ఆఫీసర్, ముగ్గురు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు, ఇద్దరు చొప్పున జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. సంఘాల పేరుతో ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేయడం పట్ల ఆ శాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పీఆర్‌లో సిఫార్సులకే సై..!

అనంతపురం న్యూటౌన్ జూన్ 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ జేఈఈ, ఏఈఈ, ఏఈ బదిలీల్లో నిబంధనలు పాటిస్తున్నామని చెబుతున్నా, సిఫార్సులకే మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. సిఫార్సు లెటర్ ఉన్నవారికే ఈఎన్‌సీ బాలు నాయక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. క్యూసీ, పీఐయూ నుంచి పీఆర్ఐకి పంపాలనే ఉద్దేశం ఉన్నప్పుడు తిరిగి మరోప్రాంతంలో ఉన్న వారికి ఆ రెండు విభాగాల్లో చోటు కల్పించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోగ్యం సహకరించకున్నా ప్రస్తుతం ఉన్న క్యూసీ స్టేషన్‌కు వచ్చి 8 నెలలే అవుతున్నా తాజాగా బదిలీ చేయడంపై ఉద్యోగ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఐదేళ్లు పూర్తయిన వారు కూడ ఏదో ఒక సాకుతో వారికి కావాల్సిన స్థానం కోసం పైరవీలు చేస్తున్నారు. అయితే 8 నెలల కిందటే క్యూసీ విభాగానికి వచ్చి మరో ప్రాంతానికి ఎంఈఓగా నియమించినా నోరు మెదపకుండా ఆ అధికారి వెళ్లారు. ప్రస్తుత బదిలీల్లో 15 మందిని బదిలీ చేస్తే.. ముగ్గిరిని క్యూసీ నుంచి ఎంఈఓ లుగా నియమించారు. దీంతో పాటు పీఐయూ నుంచి ఇద్దరిని క్యూసీకి నియమించారు.

డీపీఆర్వోగా బాలకొండయ్య

అనంతపురంటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో)గా బాలకొండయ్యను నియమించారు. తిరుపతి నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఏపీఓగా చిత్తూరు నుంచి వెంకటరమణ, ఏపీఆర్వోగా శ్రీసత్యసాయి జిల్లా నుంచి బాబాఫక్రుద్దీన్‌ను జిల్లాకు నియమించారు. వీరు సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సమాచార శాఖ వర్గాలు తెలిపాయి. ఇక్కడ డీపీఆర్వోగా ఉన్న గురుస్వామి శెట్టి, ఏపీఓ రమేష్‌బాబును తిరుపతికి, ఏపీఆర్వో హరినాథ్ నాయక్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేస్తూ సమాచార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గాలివాన బీభత్సం

కురుకుండ్ల కాలనీలో గొర్రెల కాపరి మృతి



చెట్టువిరిగి వాహనంపై పడిన దృశ్యం

రామగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు సమీపంలోని కురుకుండ్ల కాలనీలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ వర్షానికి గొర్రెల కాపరి మృతిచెందగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. 35 విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పలు చెట్లు నేలకొరిగాయి. రాత్రి 8-30గంటలకు ప్రారంభమైన గాలివాన కు ఆ కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గొర్రెల వ ద్ద కాపలా ఉన్న అశ్వత్థప్ప(70) మంచంపై నిద్రిస్తుండగా గాలికి అది ఎగిరిపోయిం ది. దీంతో కిందపడిన అశ్వత్థప్ప తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అతడితో పాటు పడుకున్న మనవడు శ్రీనివాసులు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అశ్వత్థప్పది పరిగి మండలం చిన్నపల్లి గ్రామం. అయితే అతడి అల్లుడు రాము గొర్రెల మేపుకోసం వచ్చాడని గ్రామస్థులు తెలిపారు. ఈ వర్షానికి విద్యుత్‌స్తంభాలు విరిగి పడ్డాయి. రెండు ట్రాన్స్ ఫార్మర్లు కూడా పడిపోయా యి. గృహాల మీద వేసుకున్న రేకులు కూడా దెబ్బతిన్నాయి. నర్సరీల పైకప్పుడు పూర్తిగా గాలికి కొట్టుకుపోయాయి.

రైతులకు ప్రభుత్వం అండ

రైతుసేవా కేంద్రాల ద్వారా సేవలు: కలెక్టర్

ఘనంగా ఏరువాక పౌర్ణమి

కూడేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కూడేరు మండలం కొర్రకోడు గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దులు, గొర్రుకు పూజలు చేసి విత్తనం వేసి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సేవలను రైతుసేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయిందని, రైతులకు అవసరమైన విత్తన కాయలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగాయని అన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుకు ముందుకురావాలని, ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ నాగలి పట్టి విత్తనం వేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీసీఓ అరుణకుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీవో పోలేరయ్య, ఏఓ విజయ్‌కుమార్, హౌసింగ్ ఏఈ అశోక్ పాల్గొన్నారు.



విత్తన గొర్రును తోలుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

షాకింగ్ బదిలీలు..!

పట్టుపరిశ్రమ శాఖలో చోద్యం

దరఖాస్తులు, రిక్వెస్టులు లేకుండానే స్థానచలనం

ఉన్నఫలంగా ఉత్తర్వులు జారీ... విస్మయం వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ శాఖ అధికారులు.. ఉద్యోగులకు షాక్ ఇచ్చారు. బదిలీకి దరఖాస్తు చేసుకోకున్నా.. రిక్వెస్టు కూడా పెట్టుకోకున్నా.. ఉన్నఫలంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆశ్చర్యపోవడం ఉద్యోగుల వంతైంది. బదిలీల నోటిఫికేషన్ విడుదలచేసి, దరఖాస్తులు స్వీకరించాలి. ఒకేచోట ఐదేళ్లు పూర్తిచేకున్న వారిని బదిలీచేయాలి. రిక్వెస్ట్ కింద కొందరికి స్థానచలనం కల్పించవచ్చు. ఇవే పాటించకుండానే ఉన్నఫలంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒకేసారి 15 మంది పట్టుపరిశ్రమ అధికారుల(ఎస్ఓ)కు స్థానచలనం కల్పించారు. వీరిలో ఏడుగురిని ఇతర జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. బదిలీ అయినవారిలో ఇద్దరు చొప్పున డీఎస్‌లు, ఏడీలు ఒకేచోట ఐదేళ్ల సర్వీసు కూడా పూర్తి చేసుకోలేదు. అయినా ట్రాన్స్‌ఫర్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు పడిన అధికారులనే మళ్లీ బదిలీ చేయడం గమనార్హం. గత ప్రభుత్వంలో చక్రంతిప్పిన ఉన్నతాధికారుల సలహాలతోనే బదిలీలు చేశారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

డీఎస్ఓలు, ఏడీలు కూడా...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పట్టుపరిశ్రమ శాఖాధికారు(డీఎస్ఓ)లుగా పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాకు బదిలీచేశారు. అనంతపురం డీఎస్ఓ ఆంజనేయులును కర్నూలుకు, శ్రీసత్యసాయి డీఎస్ఓ పద్మమ్మను చిత్తూరుకు పంపారు. సొంతజిల్లా కర్నూలుకు వెళ్తానని ఆంజనేయులు ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్ పెట్టుకోగా.. చిత్తూరు జిల్లా వాసి అయిన పద్మమ్మ అలాంటిదేమీ పెట్టుకోలేదు. అనంతపురం డీఎస్ఓ బాధ్యతలను కళ్యాణదుర్గం ఏడీ ఉషావర్ధినికి ఎఫ్ఏసీగాను, శ్రీసత్యసాయి డీఎస్ఓగా చిత్తూరు నుంచి శోభారాణిని నియమించారు. అనంతపురం ఏడీగా కర్నూలు నుంచి విజయకుమార్ రానున్నారు. మరో నలుగురు ఏడీలు కూడా బదిలీ అయ్యారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

గత ప్రభుత్వంలో ఇబ్బంది పడ్డవారినే..

జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఎస్ఓ బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర కాకముందే పెనుకొండకు బదిలీ అయ్యారు. కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న మరో ఎస్ఓ అనంతపురం నుంచి అక్కడికి రెండేళ్ల క్రితం వెళ్లారు. ఈ ఎస్ఓకు స్పౌజ్ ఆప్షన్ ఉంది. అయినా ఇతర జిల్లాకు బదిలీ చేశారు. పెనుకొండలో పనిచేస్తున్న ఎస్ఓ గత ప్రభుత్వంలో నానా కష్టాలుపడ్డారు. అర్హతలున్నా ఎస్ఓగా ప్రమోషన్ ఇవ్వలేదు. చేసేదిలేక చివరకు ఎస్ఓగా ప్రమోషన్ పొంది పెనుకొండలో పనిచేస్తున్నారు. ఈ ఎస్ఓను కూడా జిల్లాను దాటించేశారు. కదిరిలో పనిచేస్తున్న మరో ఎస్ఓది వేరే గాథ. కుటుంబ సభ్యులు మంచానపడ్డారని అనంతపురం నుంచి అమరావతి వరకు వేడుకున్నా కరుణించలేదు. నిర్దాక్షిణంగా పనిచేయించారు. ప్రస్తుతం ఈ ఏఎస్ఓను ఇతర జిల్లాకు పంపారు. ఇలా అత్యధిక మంది గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డవారే బదిలీ అయ్యారని పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొందరు ఏడీలు బాధితులుగా మిగిలిపోవడం శోచనీయం. ఐదేళ్లు పూర్తికాకున్నా, రిక్వెస్ట్ పెట్టుకోకున్నా, అంగీకారం లేకుండానే బదిలీలు చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎస్ఓల బదిలీల వివరాలివీ..

ఎస్ఓ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
రవీంద్ర రెడ్డి	కుప్పం	ధర్మవరం
బాలసుబ్రహ్మణ్యం	హిందూపురం	రాయచోటి
నాగభూషణం	పెనుకొండ	మడకశిర
రాజేశ్వరి	పెనుకొండ	ధర్మవరం
సుమ ముక్తశ్రీ	హిందూపురం	అనంతపురం
హంపయ్య	కుప్పర్తి	హిందూపురం
నవీన్‌కుమార్	మడకశిర	పుట్టపర్తి
అరుణ	ఆత్మకూరు	కళ్యాణదుర్గం
రేణుక	పుట్టపర్తి	అనంతపురం
లక్ష్మిరెడ్డి	హిందూపురం	కడప
రామకృష్ణ	కదిరి	కుప్పం
సుబ్రహ్మణ్యం	మదనపల్లి	హిందూపురం
ప్రతాప్‌నాయక్	మడకశిర	పలమనేరు
శ్రావణి	పలమనేరు	మడకశిర
అజీజ్	కదిరి	హిందూపురం
జయచంద్రారెడ్డి	పెనుకొండ	కుప్పం
రాజశేఖర్	మడకశిర	కదిరి
ఫిరోజ్‌బాషా	కళ్యాణదుర్గం	పలమనేరు
ఓబులేసు	అనంతపురం	పెనుకొండ
కుసుమకుమారి	ఆత్మకూరు	కళ్యాణదుర్గం
తొలచాయ నాయక్	పలమనేరు	హిందూపురం
రవినాయక్	హిందూపురం	మదనపల్లి

వన్డే క్రికెట్ పోటీల్లో శతకాల మోత

దూసుకెళ్తున్న చిత్తూరు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సీనియర్ వన్డే సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో శతకాల మోత మోగిస్తున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు బుధవారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియం(ఆర్డీటీ)లో కొనసాగింది. మొదటి మ్యాచ్‌లో చిత్తూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు నిర్ణీత 50 ఓవర్లలో కేవలం 4వికెట్లు మాత్రమే కోల్పోయి 389 భారీ పరుగులు చేసింది. బ్యాటర్లు అభిషేక్ రెడ్డి 108 పరుగులు, జ్ఞానేశ్వర్ 116 పరుగులు, సూర్య 63 పరుగులు చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 14.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. ఇందులో ధృవకుమార్ 59 పరుగులు చేశాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోవడంతో డ్రాగా ప్రకటించారు. మరో మ్యాచ్‌లో కర్నూలు, నెల్లూరు జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 49.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో గిరినాథ్ 66, నయీముల్లా 58 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 25.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నెల్లూరు 4వికెట్ల తేడాతో విజయం సాధించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా చింతపూలోత్సవం


వెండిరథంపై దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి చింత పూలోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని ప్రతియేటా ఈ ఉత్సవాన్ని స్థానిక తుమ్మలరోడ్డులోని కుంతీ తీర్థంలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే బుధవారం వర్షం కారణంగా ఆలయంలోనే వెండిరథంలో నిర్వహించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జగన్నాథుడి స్నానయాత్ర వేడుకలు



ధర్మవరం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని జగన్నాథుడికి స్నానయాత్ర వేడుకలను వైభవంగా నిర్వహించారు. మందిరంలో కొలువు దీరిన బలరామ, సుభద్ర, జగన్నాథుడి ప్రతిమలను అందంగా అలంకరించి, అనంతరం జగన్నాథుడికి స్నానయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ధర్మవరం ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్, ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి గరుడసేవ



ధర్మవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని చెన్నకేశవ స్వామికి గరుడ సేవ చేపట్టామని ఆలయ అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టిజగదీశ్, ఈఓ వెంకటేశులు పేర్కొన్నారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సాయంత్రం పున్నమి గరుడసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గరుడ వాహనంపై ఉంచి పల్లకీలో ఊరేగించారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

నల్లచెరువు, జూన్11 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని గీతా మందిరంలో పౌర్ణమి సందర్భంగా వేణుగోపాలస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాదెం శివారెడ్డి, ఉత్తన్ననాయుడు, నరసింహారెడ్డి, వెంకటరమణ, పెద్ద వెంకటరమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ధర్మవరం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిగడ్డపల్లి ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీకి చెందిన పంచాయతీ బోరు మరమ్మతులకు గురై తాగునీటి సమస్యతో కాలనీవాసులు ఇబ్బం దులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'తాగునీటికి కటకట' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన ఎంపీడీఓ సాయిమనోహర్ గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడారు. బోరు మరమ్మతులకు బుధవారం చర్యలు చేపట్టారు. దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు విజయోత్సవాలు

కదిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే విజయోత్సవాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్త, అభిమానులు తరలి రావాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టి యేడాది పూర్తి అవడంతో పాటు అలాగే పలుర కాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సంబరాలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

● నల్లచెరువు: ప్రభుత్వం ఏర్పడి యేడాది అయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేస్తున్న సందర్భంగా విజయోత్సవ సభను మండలకేంద్రంలో గురువారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, తెలుగుయువత నాయకుడు గుప్త ప్రసాద్ తెలిపారు. వారు బుధవారం మాట్లాడుతూ బస్టాండ్ కూడలిలో ఏర్పాటుచేసే సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

కళాజ్యోతి కమిటీ ఎంపిక


ఎంపికైన కళాజ్యోతి కమిటీ సభ్యులు

ధర్మవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాజ్యోతి నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా కుంటిమల నారాయణ, గౌరవాధ్యక్షుడిగా వెంకట నారాయణ, గౌరవ సలహాదారుగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జగ్గ వేణుగోపాల్, కార్యదర్శిగా బాలగొండ రామకృష్ణ, సంయుక్తకార్యదర్శిగా పాగాల అశ్వర్థనారాయణ, కార్యవర్గసభ్యులుగా రమేశ్‌బాబు, గూడూరు మోహన్‌దాసు, రాంప్రసాద్, పెద్దారెడ్డి, మధుసూదన్, రామన్న, సూర్యనారాయణరెడ్డి, కొంట్ల ఆదినారాయణలను ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు కుంటిమంల నారాయణ తెలిపారు.

ముగ్గురిపై దాడి.. కేసు నమోదు

ధర్మవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ముగ్గురు వ్యక్తులు మరో ముగ్గురిపై దాడి చేసి గాయపరిచారని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లో రామలింగమ్మ, గంగన్న దంపతులు నివాసముంటున్నారు. వీరి కుమారుడు పాళ్యం రాజేశ్ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల ఇంటి వద్ద ఉంటూ వర్క్ ఫ్రంహోం చేస్తున్నాడు. ఇదిలాఉండగా రామలింగమ్మ ఇంటి ఎదుట పొయ్యి ఏర్పాటుచేసుకుని వంట చేసుకుంటోంది. ఈ విషయంపై ఇంటి సమీపంలో ఉన్న చంద్రకళ, రామలింగమ్మ బుధవారం గొడవ పడ్డారు. గొడవ కాస్తా ఆ రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో గాయపడిన రామలింగమ్మ, గంగన్న, వారి కుమారుడు రాజేశ్‌ను చుట్టుపక్కల వారు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజేశ్ ఫిర్యాదు మేరకు చంద్రకళ, వెంకటేశ్, సంతోష్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

జీవన శైలిలో యోగా భాగం కావాలి

● యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్


యోగాసనాలు వేస్తున్న మంత్రి సత్యకుమార్, కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

ధర్మవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యోగా ఆవశ్యకతను చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు యోగాను జీవన విధానంలో ఒక భాగంగా అలవరచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21న అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం ఉదయం మంత్రి సత్యకుమార్‌యాదవ్ యోగాంధ్ర కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ నెల 21నాటికి కనీసం రెండు కోట్ల మందికి యోగా సనాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం, పట్టణంలో యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 2.25 కోట్ల మంది దాకా నమోదు చేసుకున్నారని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి యోగాసనాలను చేరువ చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ మహేశ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు సూదన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్ భాస్కర్, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థల ఉద్యోగులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, సామాజిక సేవ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యసిబ్బంది, విద్యార్థులు, పోలీసులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

అబ్బురపరచిన నృత్య ప్రదర్శన

ధర్మవరం: యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభానికి ముందు శ్రీలలిత నాట్యకళానికేతన్ గురువులు బాబూ బాలాజీ, రామలాలిత్య శిష్య బృందంలోని 15 మంది కళాకారులు ప్రదర్శించిన నృత్యం అబ్బుర పరిచింది. దీంతో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ వి. రత్న నృత్య కళాకారులను ప్రశంసించారు.



మా ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

● పల్లె పండుగలో ఎమ్మెల్యే కందికుంట


అంగన్‌వాడీ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గాండ్లపెంట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రాలను, రోడ్డు పనులను ప్రారంభించా రు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందా లంటే తమ ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన యేడాదిలోనే చాలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎంతో అధ్వానంగా ఉన్న రహదారు లకు మోక్షం కలిగిం చామన్నారు. పశువుల తాగునీటి తొట్టెలు, గోకులాలు తదితర వివిధ రకాల అభివృద్ధి పనులు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలన్నీ అందేలా ప్రభుత్వం చొరవ చూపుతోం దన్నారు. ప్రతినెల అధికారుల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు, రేషన్ దుకాణాల వద్దే నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను భవిష్యత్తులో నేరుస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీపీఓ వెంకట రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఎంపీపీ సోముశేఖర్‌రెడ్డి, కన్వీనర్ కొండయ్య, మాజీ సింగల్‌విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్, అక్రమ్‌బాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మంత్రి సమీక్ష

ధర్మవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): .నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు సౌకర్యాల అందుబాటుకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖ, వైద్యఆరోగ్యశాఖల అధికారులతో మంత్రి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సాగు నేపథ్యంలో, వ్యవసాయరంగానికి నిరంతరం విద్యుత్ సరఫరా అత్యవసరమని మంత్రి సూచించారు. సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల మార్పు తదితరల విషయాల్లో సమస్యలను అధిగమించి ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చేనేత కార్మికులు, వస్త్ర పరిశ్రమలు, ప్రజలకు తాగునీటి పంపిణీ వంటి కీలక అవసరాలకు నిరాటంకంగా విద్యుత్ అందించాలన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ఇప్పటికే మంజూరైన నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రజలకు మెరుగైన వేగవంతమైన వైద్యసేవలు అందించాల్సిన అవసరాన్నిహైలైట్ చేస్తూ 30అంశాల కార్యాచరణ ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, పంచాయతీ రాజ్, గ్రామీణ రోడ్ల శాఖ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోతులనాగేపల్లి కాలనీకి వడ్డె ఓబన్న పేరు పెట్టాలని వినతి

● ధర్మవరం: పట్టణ సమీపంలోని పోతులనాగేపల్లి కాలనీకి వడ్డె ఓబన్న పేరు పెట్టాలని వడ్డెర సంఘం నాయకులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని, పట్టణంలో ఏదో ఒక చోట వడ్డెర కమిటీ హాల్ నిర్మించాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. వడ్డెర సంఘం నాయకులు నారప్ప, తోపుదుర్తి వెంకటరాముడు, దేరంగుల అంజి తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం


సాయిలక్ష్మి(ఫైల్)

కొత్తచెరువు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె సాయిలక్ష్మి గత నెల 12వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి మండల కేంద్రంలోని గంగమ్మ గుడి కాలనీలో నివాసముంటున్న మల్లెల సాయినాథ్ బుధవారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత నెల 12న కొత్త చెరువులోని సంఘమేశ్వర రథోత్సవాలకు వెళ్లిందని, అప్పటి నుంచి కనిపించలేదని పేర్కొన్నారు. దీంతో బంధువుల ఇళ్లు, తెలిసినవారి ఇళ్ల వద్ద వెతికిన ప్రయోజనం లేదన్నాడు. దీంతో బుధవారం తండ్రి సాయినాథ్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

సైబర్ నేరగాళ్ల అరెస్ట్

● రూ.4 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, చెక్‌బుక్‌లు స్వాధీనం

కదిరి అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరలకే ఆర్వో ప్లాంటు పరికరాలు సరఫరా చేస్తామంటూ మోసం చేస్తున్న ఇద్దరిని కదిరి అప్‌గ్రేడ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్నూలులో ఆర్వోప్లాంటు పరికరాల వ్యాపారం చేస్తున్న శ్రీనివాసరావు, దుర్గాబాయి దంపతులు నష్టం రావడంతో 2023లో పుట్టపర్తికి మకాం మార్చారు. ఆర్వో ప్లాంటు పరికరాల్లో అనుభవమున్న వీరు తక్కువ ధరలకే పరికరాలు సరఫరా చేస్తామంటూ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాంట్ల నిర్వాహకులను ఫోన్‌ద్వారా సంప్రదించేవారు. ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించుకుని పరికరాలు సరఫరా చేయకుండా తప్పించుకు తిరిగేవారు. గత ఆగస్టు 2న కదిరి మండలం బోడేనాయక్ తండాకు చెందిన బాబ్‌జీనాయక్ ద్వారా రూ. 8వేలు ఫోన్ పే ద్వారా వేయించుకున్నారు. పరికరాలు సరఫరా చేయకపోవడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ సిమ్‌కార్డులు, ఖాతాలు తేరవడం, డబ్బులు వేయించుకోవడం, తరువాత డ్రా చేసుకుని ఖాతాను మూసివేయడం పరిపాటిగా మారింది. ఇలా దాదాపు వందలాది మంది నుంచి డబ్బులు వసూలు చేశారు. బుధవారం రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి ఆంజనేయస్వామి గుడివద్ద నిందితులు ఉన్నట్లు సమాచారం రావడంతో దంపతులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లు, 52 సిమ్‌కార్డులు, 13 ఏటీఎం కార్డులు, రెండు చెక్‌బుక్‌లు, వివిధ బ్యాంకులకు చెందిన 8 ఖాతా పుస్తకాలు, ఆరు బిల్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరికి సిమ్‌కార్డులు సరఫరా చేసిన తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన మోహన్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఆరోగ్యసూత్రాలు తప్పక పాటించాలి: సీహెచ్‌ఓ

పుట్టపర్తి రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు తప్పక ఆరోగ్యసూత్రాలు పాటించాలని సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని బత్తలపల్లి, జగరాజుపల్లి గ్రామాల్లో బుధవారం గర్భిణులు, చిన్నపిల్లలకు ఇచ్చే వ్యాధినిరోధక టీకాలు, అప్పుడే పుట్టిన చంటి పిల్లలకు తల్లిపాల విశిష్టత, పౌష్టికాహారం, సీజనల్ వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీటిపై సీహెచ్‌ఓ వివరించారు. అలాగే యోగాను ప్రతిదినం ఆచరించి మానసిక ప్రశాంత, సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో సూపర్ వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీ సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, ప్రమీల, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బడికి బంగారు బాట

● నేడు తెరుచుకోనున్న పాఠశాలలు
● ప్రారంభం రోజే పుస్తకాలు, యూనిఫాం
● సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం
● అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు


కదిరి ఉర్దూ మెయిన్ పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

కదిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మారనుంది. గతానికి భిన్నంగా ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేయనుంది. జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్స్, డిక్షనరీలు ఇవ్వనున్నారు. అవన్నీ ఇప్పటికే పాఠశాలలకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని పాఠశాలలకు సన్న బియ్యం, చిక్కీలు, కోడిగుడ్లు, రాగిపిండి, బెల్లం సరఫరా చేసింది. ఇటీవలే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయ్యాయి. ఎస్జీటీల బదిలీలను కూడా నాలుగు రోజుల్లో పూర్తి చేసి అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బంగారు బాటను నిర్మించింది. జిల్లా వ్యాప్తంగా 2,062 పాఠశాలల్లో 1,36,933 మంది విద్యార్థులు చదువుతున్నారు.

మొదటి రోజే విద్యార్థులకు కిట్లు

మొదటి రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలతో కూడిన కిట్ పంపిణీ చేయనున్నారు. ఈ కిట్‌లో ఆయా తరగతికి చెందిన పాఠ్య, నోటు పుస్తకాలు, డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్స్, బ్యాగ్ సిద్ధం చేశారు. పాఠ్య పుస్తకాల భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులు చేసింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రెండు పుస్తకాలు, వాటికి రెండు వర్క్ బుక్కులు ఉంటాయి. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు నాలుగు పుస్తకాలు మాత్రమే ఉంటాయి. పలు రకాల నోటు పుస్తకాలు ఇస్తారు. దీంతో విద్యార్థులకు పూర్తిగా భారం తగ్గనుంది. ఆరో తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, ఒకటో తరగతి పిల్లలకు చిత్రాలతో కూడిన డిక్షనరీ ఇస్తున్నారు.

సన్న బియ్యంతో భోజనం

గతంలో పెద్దబియ్యం (దొడ్డు)తో మధ్యాహ్న భోజనం వడ్డించేవారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సన్న బి య్యంతో భోజనం వడ్డిస్తారు. పెద్ద బియ్యంతో అన్నం ముద్ద కడుతోందని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం సన్నబియ్యంతో అన్నం చేసి విద్యార్థులకు అందించనుంది. ఇప్పటికే సన్న బియ్యం పాఠశాలలకు చేరాయి. బియ్యం పక్కదారి పట్టకుండా క్యూ ఆర్ కోడ్ వేశారు. దీనిని స్కాన్ చేస్తే బియ్యం ఎక్కడ నుంచి వచ్చాయి, క్వాలిటీ, ఇతర వివరాలు తెలుస్తాయి. రాగిజావ చేయడానికి బెల్లం, రాగిపిండికి పంపారు. మధ్యాహ్న భోజనం ఇక మరింత రుచిగా తయారు కానుంది.

అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు

అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించారు. ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాలలకు ఈనెల 16కు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు రానున్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే ఉపాయోగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కదిరి పట్టణంలో ఉన్న అన్ని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు వచ్చారు. ఈ సంవత్సరం నుంచి పట్టణంలో 12 ఉన్నత పాఠశాలలు పనిచేయనున్నాయి.

టెంపుల్ టూరిజంతో అభివృద్ధి చేస్తాం

● మొదటి సంవత్సర పాలన సంతృప్తినిచ్చింది
● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మొదటి సంవత్సర పాలన ఎంతో సంతృప్తి నిచ్చిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఏడాది పాలనపై ఆయన తన నివాసంలో బుధవారం మాట్లాడారు. ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న కదిరి ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా టెంపుల్ టూరిజంతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవంతో ప్రగతి వైపు పరిగెత్తిస్తున్నాడని అన్నారు. ఆయన సారథ్యంలో పనిచేయడం ద్వారా మంచి పాలన అందిస్తున్నామని అన్నారు. దళారుల్లేని పాలన తమ లక్ష్యమన్నారు. అభివృద్ధి తోపాటు సంక్షేమం ప్రధానమన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి అవకాశం వచ్చినా నేర్చు కోవడం లేదన్నారు. కదిరి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను పెంపొందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఏడాదిలోనే చాలా అభివృద్ధి: సింధూర

పుట్టపర్తిరూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గంలో రూ.477 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. మున్ముందు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తానని ఆమె అన్నారు. యేడాది కాలంలో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ఫోన్లో బుధవారం ఆమె వివరించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై శాసనసభ సమావేశాల్లో వాణిని వినిపించానన్నారు. వడ్డెర్ల ఆరాధ్యదైవం వడ్డేఓబన్న, ప్రపంచ ఆధ్యా త్మిక గురువు భగవాన్ సత్యసాయిబాబా జయంతిని రాష్ట్ర పండుగ గా గుర్తించేలా తాను చేసిన కృషిని అద్భుత విజయంగా తెలిపారు. తొలియేడాది కాలంలో రూ.477 కోట్లతో పలు అభివృద్ధి కార్య క్రమాలను చేపట్టానని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానన్నారు.

రసాభాసగా వక్ఫ్‌బోర్డు సమావేశం

కొత్తచెరువు, జూన్11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మస్తాన్ వలి దర్గాలో బుధవారం నిర్వహించిన వక్ఫ్‌బోర్డు సమావేశం రసాబసాగా ముగిసింది. వక్ఫ్‌బోర్డు కమిటీ విచారణాధికారి అబ్దుల్‌నజీర్, దర్గా కమిటీ ఇన్‌స్పెక్టర్ రహీం, కొత్తచెరువు అప్‌గ్రేడ్ సీఐ మారుతీశంకర్ సమక్షంలో దర్గా గదులకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆ వ్యాపార గదులను అద్దెకు తీసుకున్న వారితో సమావేశం జరగింది. వ్యాపార గదుల అద్దెలను చదరపు అడుగుల ప్రయారం పెంచాలని వక్ఫ్‌బోర్డుకు నిర్ణయించిందని కమిటీ విచారణాధికారి అబ్దుల్ నజీర్ తెలిపారు. దీనిపై గదులను అద్దెకు తీసుకున్నవారు మాట్లాడుతూ...ఇప్పటికే వ్యాపారాలు లేక అద్దెలు చెల్లించలేకపోతున్నామని తెలిపారు. ఇప్పటికే 70శాతం మేర అద్దెలు పెంచారని, మరలా పెంచితే ఇబ్బందులు పడతామని వక్ఫ్‌బోర్డు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని విచారణాధికారి తెలిపారు అనంతరం మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా మాట్లాడుతూ.... ఆక్రమణకు గురైన వక్ఫ్‌బోర్డు భూములు, మస్తాన్ దర్గాకు చెందిన అద్దె గదుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్‌బోర్డు అధికారుల దృ ష్టికి తీసుకెళ్లారు. దీనిపై మరో వర్గం వారు గొడవకు దిగారు. దీంతో సమావేశం కాస్తా రసాభాసగా మారడంతో సీఐ మారుతీశంకర్ కలుగుజేసుకుని రెండు వర్గాలను బయటకు పంపారు. వక్ఫ్‌బోర్డు అధికారులు సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి

● సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన


విద్యుత్ శాఖ డీఈతో చర్చిస్తున్న రైతులు

గాండ్లపెంట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని పలు గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పలు గ్రామాల రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. దాదాపు 15రోజులుగా నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదని, నిత్యం విద్యుత్ అంతరాయం ఏర్పడు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సాగుచేసిన పంటలు ఎండుముఖం పట్టాయన్నారు. అలాగే గ్రామాల్లో రాత్రి సమయంలోనివాసా గృహాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్ప డుతోందన్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితంలేదన్నారు. దీంతో సబ్‌స్టేషన్ వద్ద గాండ్లపెంట, పోతువాండ్లపల్లి, ఎల్లుగూటివారిపల్లి, నాయనవారిపల్లి, జీన్లకుంట తదితర గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డీఈ ఓబులేసు అక్కడకి చేరుకుని రైతులతో చర్చించారు. రెండు రోజుల్లోగా లోపాలను సవరించి అంతరాయ లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

'వారం రోజుల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి'

ధర్మవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురంలో 650-2 సర్వే నంబరు లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. లేకపోతే మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎన్జీఓహోంలో బుధవారం కార్మికుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టి రమణ, ఏపీచేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటరమణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, యువజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నకల రాజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం ధర్నా

తనకల్లు, జూన్11(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం బైటాయించి ధర్నా చేశారు. తనకల్లు గ్రామ పొలం సర్వేనెంబర్ 793లో 12. 87 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమిలో నిరుపేదలకు పట్టాలివ్వాలని వినతిపత్రాన్ని తహసీల్దార్ శోభానువర్ణమ్మకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేమన్న, సీపీఎం శివన్న, పలువురు పేదలు పాల్గొన్నారు.

రహదారిని పరిశీలించిన ఆర్డీఓ

కదిరి అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి వద్ద ఖాద్రీ గిరి ప్రదక్షిణ రహదారిని బుధవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మ పరిశీలించారు. ఖాద్రీకొండపై కొండల నరసింహ స్వామి చెంచులక్ష్మీ సమేతంగా వెలిశారు. ప్రతినెల స్వాతి నక్షత్రం రోజున భక్తులు గిరప్రదక్షిణ చేయడానికి దారి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి భక్తులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్డీఓ పరిశీలించారు. భక్తులు ప్రదక్షిణ చేయడానికి వీలుగా రహదారి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నాణ్యమైన పరికరాలనే వాడుతాం

మున్సిపల్ చైర్మన్ రమేష్



పైపులు, మోటార్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసే బోరు మోటార్లు, పైపులు, ఇతరత్ర పరికరాలు నాణ్యతవే వాడతామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చిన కొత్త మోటార్లు, పైపులు, వాల్వులు ఇతర పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పరికరాలు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యత పాటించడం జరుగుతుందన్నారు. పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతాయని వార్డుల్లో నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

ఏఐఎస్‌ఏ నాయకులు



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన

హిందూపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పోరాటం చేస్తామని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. బుధవారం హిందూపురంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి చొరవ చూపుతామన్నారు. ఈసందర్భంగా హిందూపురం పార్లమెంట్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నవీద్, పట్టణాధ్యక్షునిగా మహేష్, కార్యదర్శి సల్మాన్, మరో ఇద్దరు ఉపాధ్యక్షులు మొత్తం 20మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

బూదిలిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



బూదిలిలో రైతు సమస్యలు వింటున్న ఆర్డీఓ సువర్ణ

గోరంట్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామంలో బుధవారం భూ సమస్యలు, ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మల్లాపల్లి, మందలపల్లి, వడిగేపల్లి, బూదిలి, పాలసముద్రం గ్రామాలకుచెందిన పలువురురైతులు పాల్గొన్నారు. 32మంది రైతులు తమసమస్యలపై ఆమెకు ఫిర్యాదుచేశారు. ఆమెతోపాటు తహసీల్దార్ మారుతి, రెవిన్యూ అధికారులు సల్మాన్‌ఖాన్, పవన కుమార్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి

ఏఐఎస్‌ఎఫ్ నాయకులు



అక్రమంగా అమ్ముతున్న పాఠ్యపుస్తకాలు చూపుతున్న నాయకులు

హిందూపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని వాటిపై చర్యలు తీసుకోవాలంటూ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలవద్దకు వెళ్లగా అక్రమంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తూ యూనిఫాం అమ్ముతున్నారన్నారు. ఇలాంటి పాఠశాలలపై ఉన్నతాధికారులుచర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయలేదన్నారు. ఈ సందర్భంగా ఓగోదామును అద్దెకు తీసుకుని విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలవద్దకు వెళ్లి వాటిని అమ్మకూడదని నిలదీశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నరసింహమూర్తి, ప్రభాకర్, మహేష్, శివ, శబరీష్ పాల్గొన్నారు.

నేడు ఏడాది పాలనపై సంబరం

హిందూపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి గురువారం నాటికి యేడాది అవుతున్న సందర్భంగా హిందూపురంలో కూటమి పార్టీల నాయకులు సంబరాలు జరుపుకోనున్నారు. నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచనున్నారు. ఈ యేడాది నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిపై ప్రజలకు తెలియజేయనున్నారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలిరావాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ ఓ ప్రకటనలో కోరారు.

అగళిలో విజయోత్సవ ర్యాలీ

అగళి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జరిగే విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కుమారస్వామి, జడ్పీటీసీ ఉమేష్ పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు జరిగే విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ర్యాలీలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

అమరాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన సందర్భంగా బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్ కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నాటి రీ సర్వే పాపం... నేడు రైతులకు శాపం

సంయుక్త ఎల్‌పీఎం నంబర్లతో చిక్కులు
ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే పరిస్థితి
వెబ్‌ల్యాండ్ ద్వారానే పంట రుణాలు, రెన్యువల్
దిక్కుతోచని స్థితిలో రైతులు



బ్యాంకుకు వచ్చిన కల్లుమర్రి రైతులు

మడకశిర రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో రీ సర్వే అస్తవ్యస్తంగా చేపట్టిన కారణంగా ఇప్పటికీ అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. భూ సర్వే కారణంగా ఇద్దరు నుంచి 10 మంది దాకా రైతులకు జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) నెంబర్లు ఇచ్చారు. జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్న రైతులకు బ్యాంక్‌లో రుణాలు ఇవ్వడంలేదు. పట్టాదారుడి పేరుపైనే పట్టాదారుని పాసుపుస్తకాలు పక్కాగా ఉంటేనే ఆ రైతులకు మాత్రమే బ్యాంకు రుణాలు ఇస్తున్నారు. రైతులు రుణాలను పొందడం కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో భూములకు సంబంధించి వన్‌బీ తీసుకెళ్లిన బ్యాంకు అధికారులు నేరుగా రుణాలు ఇవ్వడంలేదు. ప్రభుత్వ వెబ్‌ల్యాండ్‌లో డేటా పరిశీలించిన తరువాతే రైతులకు రుణాలు మంజూరుచేస్తున్నారు. వైసీపీ పాలనలో అనాలోచితంగా భూములు రీ సర్వేతో భూముల విస్తీర్ణంలో వ్యత్యాసం వచ్చిన నేపథ్యంలో రైతులు ఇన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పడాల్సిన పరిస్థితి నెలకొంది.

పథకాలకు దూరమయ్యే పరిస్థితి

మండలంలో కల్లుమర్రి పంచాయతీలో భూముల రీ సర్వే చేపట్టారు. పంచాయతీలో కల్లుమర్రి, తడకలపల్లి, అగ్రంపల్లి, గంతలపల్లి ఎల్లోటి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలోని రైతుల వద్ద రెవెన్యూ అధికారుల లెక్కల మేరకు 1800 పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. జగనన్న రీ సర్వేచేసిన తరువాత జాయింట్ ఎల్‌పీసీలు రావడంతో ఇద్దరు నుంచి ఐదుగురి దాక రైతులకు కలిపి సంయుక్తంగా 800 పాసుపుస్తకాలు ఇచ్చారు. దీంతో రైతులు రీసర్వేపై అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రైతులు వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకంలో రీ సర్వేచేసిన తరువాత జగనన్న పేరుతో ఇచ్చిన పాసుపుస్తకాల్లో భూ విస్తీర్ణంలో భారీ తేడాలు ఉండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేసి కొత్తగా ఇచ్చిన పాసుపుస్తకాలను తగులబెట్టారు. జాయింట్ ఎల్‌పీఎంలతో రైతులకు ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పెట్టుబడి సహాయం పథకాలు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. అయితే నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో రీ సర్వే భూములను తిరిగి సర్వేచేసి రెవెన్యూ రికార్డులను చక్కపెట్టేపనిలో అధికారులు ఉన్నారు.

వైసీపీ భూముల రీ సర్వే వల్లే రైతులకు కష్టాలు



వైసీపీ పాలనలో భూముల రీసర్వే కారణంగా భూముల్లో భారీ వ్యత్యాసం వచ్చింది. దీంతో ఇద్దరు నుంచి ఐదుగురికి కలిసి పాసుపుస్తకం ఇచ్చారు. నాకు 3.88 ఎకరాల భూమి ఉంటే కేవలం 1.43 ఎకరాలు ఉన్నట్లు మాత్రమే చూపుతున్నారు. ఈ పాసుపుస్తకంతో బ్యాంక్‌లో పంట రుణాలు కూడా ఇవ్వడం లేదు.

- నారాయణప్ప, రైతు, కల్లుమర్రి

డేటా ఆధారంగా చేస్తున్నాం

రీ సర్వే వల్ల భూముల విస్తీర్ణంలో భారీగా తేడాలు ఉండడంతో బ్యాంకు రుణాలు, రెన్యువల్ కోసం వచ్చే రైతులు తీసుకువస్తున్న వన్‌బీగాని, పాసుపుస్తకాన్ని చూసి రుణాలు మంజూరు చేయడంలేదు. వారు తీసుకొచ్చే వన్‌బీలో భూ విస్తీర్ణం భారీ తేడాలు ఉన్నాయి. అందుకోసం ఆ రైతుకు సంబంధించి ప్రభుత్వ వెబ్‌ల్యాండ్ ఉన్న భూమికి మాత్రమే రుణాలు ఇస్తున్నాం.

- కుమార్‌రాజ్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్, కల్లుమర్రి

వెబ్‌ల్యాండ్ ఆధారంగా పథకాలు అందిస్తున్నాం

భూముల రీ సర్వే తరువాత జాయింట్ ఎల్‌పీఎంలు ఉండడంతో రైతులు ప్రభుత్వ పథకాలకు దూరంకాకుండా వెబ్‌ల్యాండ్ ఆధారంగా అందిస్తున్నాం.

- తిమ్మప్ప, మండల వ్యవసాయశాఖ అధికారి, మడకశిర

హంద్రీనీవా కాలువలకు మహర్దశ

మరమ్మతులకు రూ.5 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
ఐదేళ్ల పాలనలో పట్టించుకోని వైసీపీ



కంపచెట్లతో హంద్రీ నీవా కాలువ

మడకశిర, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా హంద్రీనీవా కాలువల మరమ్మతులు నోచుకోక నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో కృష్ణానది జలాలు చెరువులకు వదిలినప్పుడు గండ్లు పడి నీరు చెరువులకు చేరకుండా వృథాగా పోతోంది. మరమ్మతుల కోసం అప్పట్లో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ కింద నిధులు మంజూరు చేసింది. మడకశిర బ్రాంచి కెనాల్ నుంచి నియోజకవర్గంలోని గుడిబండ వరకు 238 కిలోమీటర్లు కాలువ పారుతుంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువలో కంప చెట్లు పెరిగిపోయాయి. పూడిక పేరుకుపోయింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని పోవడంతో స్పందించి ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ కింద రూ. 5 కోట్ల దాకా నిధులు మంజూరు చేసింది. మడకశిర నియోజకర్గానికి రూ.1.32 కోట్లు, పెనుకొండకు రూ.1.80 కోట్లు, హిందూపురానికి రూ.1.65 కోట్లు, కదిరికి రూ.35లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా ఆహ్వానించినట్లు సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నారు. సీకేపల్లి- న్యామద్దెల నుంచి గొల్లపల్లి రిజర్వాయర్, అక్కడ నుంచి పెనుకొండ, సోమందేపల్లి, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి మడకశిర, జంబలబండ వరకు హంద్రీనీవా పారుతుంది. మంజూరు అయిన నిధులతో కాలువకు మరమ్మతులు చేపట్టనున్నారు.

పూడిక తొలగిస్తే నీరు చెరువులకు చేరుతుంది



ఐదు సంవత్సరాలుగా హంద్రీనీవా కాలువలో పూడిక పేరుకుపోయింది. కంప చెట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో కాలువలకు నీరు వదిలినప్పుడు, వర్షాలు వచ్చినప్పుడు నీరు ముందుకు సాగకుండా ఉంటోంది. పూడిక, కంప చెట్లను తొలిగిస్తే నీరు చేరుతుంది.

- సన్నలింగప్ప, అగ్రహారం

మరమ్మతులకు రూ.ఐదు కోట్లు మంజూరు

హంద్రీనీవా కాలువల మరమ్మతులకు, రూ. 5 కోట్లు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. దీంతో కాలువలోని పూడిక తీసి, పెరిగిన చెట్లను తొలగిస్తాం. ఇందుకోసం టెండర్లు కూడా పిలవడం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

- నాగార్జున, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, ఏఈ

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మంత్రి సవిత



బీటీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పరిగి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొడికొండ శిర హైవే వద్ద సింగిరెడ్డిపల్లి క్రాస్ నుంచి బసవనపల్లి వరకు రూ.2.10కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. అక్కడి నుంచి పరిగి సమీపంలోని హైవే నుంచి తిరుమలదేవరపల్లికి రూ.కోటితో బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో గ్రామీణప్రాంతాలు అభివృద్ధివైపు వెళుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడంతప్ప ప్రజలకు ఏమీచేయలేదన్నారు. వైసీపీ నాయకులు మహిళలపై ఏవిధంగా దుర్భాషలాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మహిళలను అవమానపరిస్తే భగవంతుడు జగన్‌రెడ్డిని శిక్షిస్తాడన్నారు. మహిళలంటే జగన్‌కు విలువలేదని, సొంత తల్లి, చెల్లిని, చిన్నాన్న కూతుర్ని ఏంచేశాడో ప్రజలకు తెలుసన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ప్రభుత్వం యేడాదిలోనే చేసి చూపించిందని పేర్కొన్నారు. ఎక్కడి నుంచి వలస పక్షులు వచ్చాయో వారి సొంత నియోజకవర్గం వెళ్లి అడిగితే వారి చరిత్ర బయటపడుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 70లక్షల మంది విద్యార్థులకు రూ.9వేల కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేయనున్నారన్నారు. అనంతరం తిరుమలదేవరపల్లి ప్రజలు స్మశానం కోసం స్థలం కేటాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీడీఓ రెడ్డప్ప, ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, తిలక్, మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయానికి టీడీపీ పెద్దపీట

లేపాక్షి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దీంతో గ్రామాలు, రైతులు ఎంతో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని మండల టీడీపీ కన్వీనర్ అభిలాష్ అన్నారు. బుధవారం పులమతి గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన నీటి తొట్టెలను, రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో రైతులకు కావాల్సిన అన్ని పథకాలు అందుతాయన్నారు. టీడీపీ నాయకులు మారుతిప్రసాద్, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

రొద్దం/చిలమత్తూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం గ్రామంలో సబ్సిడీ వేరుశనగను టీడీపీ నాయకులు, అధికారులు బుధవారం ప్రారంభించారు. మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు. అదేవిధంగా రొద్దం-1 రైతు సేవాకేంద్రంలో హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి నరసింహులు, వాల్మీకి చంద్రశేఖర్ విత్తన వేరుశనగ పంపిణీ చేపట్టారు.

చిలమత్తూరు: చిలమత్తూరులో జరిగిన విత్తన పంపిణీలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, ఏఓ వంశీకృష్ణ, నాయకులు రంగారెడ్డి, లక్ష్మీనరసప్ప, బేకరీ గంగాధర్, అశ్వర్థప్ప, శ్రీదేవి, చంద్ర, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేరుశనగ పంపిణీ

సోమందేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి రైతుల్లో సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేయనున్నట్లు ఏఓ కవితారాణి తెలిపారు. ఇప్పటికే మండలంలో ఉన్న 13ఆర్బీకేలకు ఒక్కోదానికి 50క్వింటాళ్ల చొప్పున మొదటి విడత కే-6రకం వేరుశనగ చేరింది. సబ్సిడీ పోను రూ1674 బస్తా అందిస్తున్నట్లు తెలిపారు. అర ఎకరాకు ఒకబస్తా, ఎకరానికి రెండు, ఎకరంపైనుంటే మూడు బస్తాలు అందిస్తామన్నారు. వేరుశనగ కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, సెల్‌ఫోన్‌లతో రావాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ



సీడీపీఓ శాంతలక్ష్మి

సోమందేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నూతన సీడీపీఓగా శాంతలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె పెనుకొండలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. గతంలో పనిచేస్తున్న సీడీపీఓ అనురాధ బదిలీపై వెళ్లగా కొంతకాలంగా సూపర్‌వైజర్ రాజేశ్వరి సీడీపీఓ బాధ్యతలు వ్యవహరించారు. సీడీపీఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీని, పిల్లల చదువుపట్ల బాధ్యతతో వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ సీడీపీఓగా ధనలక్ష్మి



ధనలక్ష్మి

పెనుకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నూతన సీడీపీఓగా ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీడీపీఓగా పనిచేస్తున్న శాంతలక్ష్మి సోమందేపల్లికి బదిలీ కాగా ఆమె స్థానంలో అనంతపురం రూరల్‌లో పనిచేస్తున్న ధనలక్ష్మి ఇక్కడకు వచ్చారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బదిలీ

హిందూపురం(రొద్దం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): పెద్దమంతూరు క్లస్టర్‌కింద పనిచేసే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పుట్టపర్తి ఐసీడీఎస్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చెన్నకొత్తపల్లి మండలంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మీ ఇక్కడకు వచ్చారు.

రొద్దంలో గాలివాన బీభత్సం

రొద్దం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. అరగంటపాటు భారీ వర్షం కురిసింది. రైతులు తమ పొలాలు విత్తనం వేయడానికి సిద్ధం చేసుకోగా వర్షం రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం వద్ద ఉన్న నాసిన్ అకాడమిలో కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ జాన్‌రెడ్డప్ప ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చేరాలనే విద్యార్థులకు ఈనెల 16 నుంచి దరఖాస్తులను అందజేస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు ఇవ్వడం జరుగుతుందని, వాటిని పూర్తి చేసి ఈనెల 25వ తేదీ లోపు కార్యాలయంలో సమర్పించాలన్నారు. 27న లక్కీ డ్రా ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల జాబితాలను 28న ప్రకటిస్తారన్నారు.

నేడు గోపుర కలశ ప్రతిష్ఠ

మడకశిర రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ ఈచలడ్డి గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ గోపురకలశ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 3 గంటలకు ఉట్లపరుష ఉంటుందన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న లోకాయుక్త రెవెన్యూ సీఐ

పావగడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రెవెన్యూ లోకాయుక్త సీఐ అడవిష గుడియప్ప బుధవారం పావగడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రైతుల నుంచి వచ్చిన సమస్యలపై ఆరాతీశారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అనేక మంది రైతులు తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సీఐ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులను కారణం లేకుండా తిప్పించుకోవద్దని సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ కార్యాలయానికి తెలపాలని సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన వృద్ధుడు మోహన్‌నాయక్ బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మద్యం సేవించడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.

నేడు బుక్కపట్నంలో ఏటీఎస్ ప్రారంభం

హిందూపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వాహనాలు ఫిట్నెస్(ఎఫ్‌సీ) కోసం బుక్కపట్నంకు వెళ్లాల్సి వస్తుందని ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డి తెలిపారు. బుక్కపట్నం వద్ద ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటుచేసిన ఏటీఎస్(ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్) గురువారం ప్రారంభం కానుందన్నారు. ప్రతి వాహనదారుడు ఎఫ్‌సీ కావాలంటే అక్కడికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని వాహనదారులు ఇది గుర్తించాలన్నారు.

వ్యాపారిని కాపాడిన పురం పోలీసులు

హిందూపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టపోయి చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వ్యక్తిని హిందూపురం పోలీసులు కాపాడినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. హిందూపురంలోని విద్యానగర్‌కు చెందిన త్యాగరాజ్ పట్టణంలో ఓ బ్యాంకులో గోల్డ్‌లోన్ అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన మూడునెలల క్రితం హిందూపురంలో సుమారు రూ.15లక్షలు అప్పులు చేసి మామిడితోటలు కొన్నాడు. మామిడి పండుకు ధరలు రాకపోవడంతో నష్టం వచ్చింది. దీంతో చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక పరువు పోతుందన్న ఆలోచనతో ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నాడు. బుధవారం తాను చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీసుకుని పోలీసులకు పంపాడు. దీంతో స్పందించిన డీఎస్పీ మహేష్ వెంటనే టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం, ఎస్‌ఐ శ్రీధర్‌ను అప్రమత్తం చేసి సాంకేతిక పరిజ్ఞానంతో ఆయన ఉన్న ప్రాంతాన్ని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు డీఎస్పీ తెలిపారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

పెనుకొండ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమలో ఈనెల 16న జరగనున్న యోగాంధ్రను విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఆనంద్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ కియా పరిశ్రమలో 6 గంటలకు జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు సిబ్బంది, టీచర్స్, మర్చెంట్స్ అసోసియేషన్స్, వ్యాపారవేత్తలు, బ్యాంక్, విశ్రాంత ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్